# "ప్రేమయే నా సంపద"

ప్రేమస్వరూపులారా! లోభమును మించిన వ్యాధి మరొకటి లేదు. వ్యాధి కేవలం శరీరానికి మాత్రమే కాదు; మనస్సుకు, ఇంద్రియాలకుకూడా సంభవిస్తుంది. లోభంవలన దుర్యోధన, దుశ్శాసనులేరీతిగా పతనం చెందారో చరిత్ర బోధిస్తున్నది కదా! లోభమే మానవునికొక తీరని రోగం. నాయందు లోభంలేదు, కనుక నాకు రోగమనేది రాదు. నేను ఎప్పుడూ ఆరోగ్యంగానే ఉంటాను. మనిషికి క్రోధమును మించిన శత్రువు మరొకటి లేదు. నాయందు క్రోధం లేదు. అంతే కాదు. నాకు ఎవరిపైనా ద్వేషం లేదు, ఎవరికీ నాపై ద్వేషం లేదు. అందరూ నావారే. నేను అందరినీ ప్రేమిస్తాను. అందరూ నన్ను ప్రేమిస్తారు. మానవునికి దారిద్ర్యమును మించిన దుఃఖం మరొకటి లేదు. నాకు దారిద్ర్యమనేదే లేదు. ప్రేమయే నా సంపద. కనుక నేనెప్పుడూ ఆనందంగా ఉంటాను. వ్యాధియా? లేనే లేదు. ద్వేషులా? కానరారు. దారిద్ర్యమా? అసలే లేదు. ఇంక, నాకెందుకు విచారం? నాకు విచారమనేదే లేదు.

ప్రేమస్వరూపులారా! గర్గమహర్షి యాదవుల కులగురువు. అతడు మహాపండితుడు, మహాజ్ఞాని, గొప్ప శాస్త్రజ్ఞుడుకూడా. అతడు యశోదానందుల ఇంటికి పిల్లలకు నామకరణం చేయటానికి వచ్చాడు. శుక్ల, అరుణ, పీత - ఈ మూడు వర్ణములతో అవతారములు వస్తుంటాయి. కాని ఈ పిల్లవాడు కృష్ణవర్ణము కలిగివచ్చాడు. కనుక, ఇతనికి కృష్ణుడనేది తగిన పేరని చెప్పాడు. నామకరణం చేసిన తరువాత భవిష్యత్తులో కృష్ణుడు చేయబోయే లీలలను గురించి తెలియజేసి వెళ్ళిపోయాడు.

కొంతకాలమైన తరువాత గర్గుడు బలరామకృష్ణులను చూడటానికి మళ్ళీ యశోదానందుల ఇంటికి వచ్చాడు. కృష్ణుడు ఇల్లంతా తిరుగుతూ అల్లరి చేస్తున్నాడని యశోద అతనిని ఒక గదిలో పెట్టింది. గర్గమహర్షి ఇతరులు వండిన పదార్థములను భుజించేవాడుకాదు. ఆయనకు స్వయంగా వండుకొని భుజించటం అలవాటు. అందుచేత, యశోద ఆయనకు వంట నిమిత్తం కొన్ని పదార్థముల నిచ్చింది. అప్పుడు గర్గుడు "అమ్మా! నేడు వంట వండుకోవటానికి తగినంత

sri sathyasai vachanamrutam

వ్యవధి లేదు. నాకు కొంత బెల్లము, రవ్వ, పాలు ఇస్తే పాయసం తయారుచేసుకుంటాను" అన్నాడు. ఆ కాలంలో చక్కెర వాడుకలో లేదు; బెల్లమునే ఉపయోగించేవారు. గర్గుడు పాయసమును వండి దానినొక పాత్రలో పోశాడు. తాను విష్ణుభక్తుడు కనుక కన్నులు మూసుకొని విష్ణునామస్మరణ చేస్తూ కూర్చున్నాడు. ఇంతలో కృష్ణుడు తానున్న గది నుండి పరుగెత్తుకొని వచ్చి ఆ పాయసమును తినటం ప్రారంభించాడు. ఏదో శబ్దమౌతున్నదని గర్గుడు కన్నులు తెరిచి చూసేసరికి కృష్ణుడు పాయసమును ఆరగిస్తున్న దృశ్యం కనిపించింది.

వెంటనే ఆయన యశోదను పిలిచి "అమ్మా! చూచితివా నీ కుమారుడు చేస్తున్న పని? నేను తినటానికి పాయసమును వండి విష్ణువుకు నైవేద్యం పెట్టాను. ఇంతలో కృష్ణుడు వచ్చి దానిని ఆరగిస్తున్నాడు" అని ఫిర్యాదు చేశాడు. యశోద కృష్ణుని చేయి పట్టుకొని లాగి "కృష్ణా! గర్గమహర్షి మన కులగురువు. ఆయన భుజించకుండా నీవు భుజించటం న్యాయమా? అతిథి, అభ్యాగతులను ఆదరించటం మన ధర్మం కదా!" అన్నది. అప్పుడు కృష్ణుడు "అమ్మా! ఆయన పిలవటంచేతనే నేను వచ్చాను" అన్నాడు. యశోద గర్గునితో "స్వామీ! మా పిల్లవానిని మీరే పిలిచారట కదా!" అన్నది. గర్గుడు "అమ్మా! నేను పిలువలేదే" అన్నాడు. అప్పుడు కృష్ణుడు "మహర్షీ! మీరే నన్ను పాయసమును భుజించవలసిందిగా ప్రార్థించి ఇప్పుడు వెనక్కి నెట్టటం న్యాయమా?" అన్నాడు. అప్పుడు గర్గుడు కృష్ణుడు, విష్ణువు ఇరువురూ ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించి, కృష్ణుడు ఆరగించగా మిగిలిన పాయసాన్ని భుజించి సంతృప్తి చెందాడు.

**కృష్ణుడు ఎప్పుడు పుట్టాడు?**

క్రీస్తు పూర్వం 3228 వ సం॥ శ్రావణమాసంలో, ఇప్పటి ఇంగ్లీషు కేలండరు ప్రకారం జూలై 20 వ తేదీన రాత్రి 3 గం॥ల సమయంలో కృష్ణుడు జన్మించాడు. ఇప్పుడు 2001 వ సం॥ జరుగుతోంది. అనగా కృష్ణుడు జన్మించి ఈనాటికి మొత్తం 5229 సం॥లు గడచినవన్నమాట. కృష్ణుడు పవిత్రమైన శ్రావణ బహుళ అష్టమి, రోహిణీ నక్షత్రమందు జన్మించి అనేక అద్భుతాలను ప్రదర్శించాడు. కంసుని ఆస్థానంలో బాలహంతకి అనే రాక్షసి ఉండేది. ఆమె తన అసలు పేరు ఎవరికీ చెప్పేది కాదు. ఆమెను అందరూ పూతన అని పిలిచేవారు. ఆమె చేసే పని ఏమిటి? ప్రతి పల్లెలోనూ తిరగటం, ప్రతి ఇంటిని చూడటం... ఏ ఇంట్లో

srisathyasaivachanamrutam

చంటిబిడ్డ ఏడుపు వినిపిస్తే ఆ ఇంట్లో ప్రవేశించి ఆ బిడ్డకు విషపూరితమైన పాలు త్రాగించి హతమార్చేది. ఈవిధంగా ఆమె తిరిగి తిరిగి వ్రేపల్లెకు వచ్చింది. ఒక అందమైన స్త్రీ రూపాన్ని ధరించి యశోద ఇంట్లో ప్రవేశించింది. ఊయలలోనున్న కృష్ణుని ఎత్తుకొని విషపూరితమైన తన పాలనివ్వటం ప్రారంభించింది. కృష్ణుడు ఏమాత్రం అల్లరి చేయకుండా పాలతోపాటు ఆమె దేహంలో ఉన్న రక్తమునుకూడా పీల్చి ఆమెను హతమార్చాడు. ఈ విధంగా, కృష్ణుడు తన బాల్యమునుండియే అనేక అద్భుతాలను ప్రదర్శిస్తూ వచ్చాడు.

**బాలకృష్ణుని దివ్యలీలలు**

ఒకనాడు కృష్ణుడు వ్రేపల్లెలోని ఇతర బాలురతో కలసి గోవులను మేపటానికి అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ అవి గడ్డి మేస్తుంటే గోపాలురు కృష్ణునితో కలసి ఆనందంగా ఆడుతూ, పాడుతూ గోవుల సంగతి మరచిపోయారు. కాలమే వారికి తెలియలేదు. ఆ గోవులు క్రమక్రమేణ అడవిలో చాలా దూరం వెళ్ళిపోయాయి. ఉన్నట్లుండి ఆ అడవిలో దావాగ్ని ప్రజ్వరిల్లింది. తమను చుట్టుముట్టుతున్న మంటలను చూసి గోపాలురు చాలా భయపడి "కృష్ణా! ఇప్పుడు మా గతి ఏమిటి? గోవులు ఏమైపోయినాయో! మమ్మల్ని రక్షించు" అని ప్రార్థించారు. అప్పుడు కృష్ణుడు "గోపబాలులారా! మీరేమీ కంగారు పడకండి. ఈ మంటలు చల్లారిపోతాయి. మీరు కొద్దిసేపు కన్నులు మూసుకోండి'' అన్నాడు. గోపాలురు కృష్ణుని ఆజ్ఞను జవదాటేవారుకాదు. అతడు చెప్పినట్లుగా అందరూ కన్నులు మూసుకున్నారు. కొంతసేపటికి అగ్ని పూర్తిగా చల్లారిపోయింది. గోవులన్నీ తిరిగి వచ్చేశాయి. గోపాలురు పొందిన ఆశ్చర్యానికి, ఆనందానికి అవధులు లేవు. వారు తమ గ్రామానికి తిరిగి వచ్చిన తరువాత కృష్ణుడు ప్రదర్శించిన అద్భుతమైన లీలను అందరికీ చెబుతూవచ్చారు. "అంతటి గొప్ప అగ్నిని కృష్ణుడు క్షణంలో చల్లార్చాడు. అది మానవ మాత్రులు చేయలేరు. కనుక కృష్ణుడు సామాన్య మానవుడు కాడు, సాక్షాత్తు దైవస్వరూపుడే" అని తమ గ్రామంలో చాటుతూ వచ్చారు.

మరొక పర్యాయం కృష్ణుడు గోవులను మేపటానికి గోపబాలుర వెంట అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ కొద్దిసేపు ఆడుకున్న తరువాత కృష్ణుడు తనకు ఆకలి వేస్తున్నదన్నాడు. వెంటనే ఒక బాలుడు తాను ఊర్లోకి వెళ్ళి తినటానికి ఏమైనా తెస్తానన్నాడు. అప్పుడు కృష్ణుడు "అంతదూరం

sri sathyasai vachanamrutam

పోనక్కర్లేదు. ఇక్కడికి అతి సమీపంలో కొందరు బ్రాహ్మణులు ఒక యజ్ఞం చేస్తున్నారు. మీరక్కడికి వెళ్ళి మా గోపాలునికి ఆకలిగా ఉందని చెప్పి, అన్నం పెట్టమని అడగండి" అన్నాడు. కృష్ణుడు చెప్పినట్లుగా గోపాలురు అక్కడికి వెళ్ళి అడుగగా ఆ బ్రాహ్మణులు అందుకు అంగీకరించలేదు. యజ్ఞమునకు పూర్ణాహుతి జరిపి, తాము భుజించిన తరువాతనే ప్రసాదం పెడతామన్నారు. గోపాలురు నిరాశతో తిరిగి వచ్చి జరిగిన సంగతి కృష్ణునికి చెప్పారు. అప్పుడు కృష్ణుడు "పిల్లలయొక్క ఆకలి బాధ అమ్మలకు తెలుస్తుందిగాని, అయ్యలకేమి తెలుస్తుంది? కనుక మీరు వెళ్ళి వారి భార్యలను అడగండి" అన్నాడు. గోపాలురు మళ్ళీ అక్కడికి వెళ్ళేటప్పటికి ఆ బ్రాహ్మణుల భార్యలు అనేక రకములైన వంటలు చేస్తున్నారు. ఈ పిల్లలు "అమ్మా! మేము కృష్ణుడు పంపగా వచ్చాము. అతడు చాలా ఆకలితో ఉన్నాడు; మిమ్మల్ని భోజనం పెట్టవలసిందిగా అడుగుతున్నాడు" అన్నారు. "ఆహా! సర్వులకూ ఆహారమునందించే భగవంతుడు తనకు భోజనం పెట్టవలసిందిగా మమ్మల్ని అడుగుతున్నాడా? మా జన్మలు ధన్యమైనాయి" అని వారెంతో ఆనందించి, ఆహారపదార్థాలను మూటకట్టుకొని భర్తలకు చెప్పకుండా కృష్ణునివద్దకు వచ్చారు. కృష్ణునికి, గోపాలురకు చక్కగా భోజనం పెట్టారు. వారు భుజించిన తరువాత కృష్ణుడు "అక్కడ మీ పతులు మీకోసం కాచుకొని ఉంటారు. 'కర్తవ్యం యోగముచ్యతే' మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించాలి. కాబట్టి ఆలస్యం చేయకుండా వెళ్ళండి" అన్నాడు. కాని, వాళ్ళకి వెళ్ళటానికి మనసొప్పలేదు. "కృష్ణుని సన్నిధే మా పెన్నిధి" అని భావించి వారు ఆనందాన్ని అనుభవిస్తున్నారు. అతికష్టంమీద కృష్ణుణ్ణి వదలిపెట్టి తమ పతుల వద్దకు తిరిగి వెళ్ళారు. కృష్ణుడు లీలామానుష విగ్రహుడు. అతని మహిమచేత ఆ బ్రాహ్మణుల మనస్సులు మారిపోయాయి. వారు తమ పత్నులు చేసిన పనికి ఎంతో ఆనందించి "మాకు కృష్ణుని ప్రసాదం తెచ్చారా?" అని అడిగారు. ఆ ప్రసాదాన్ని అందరూ ఆనందంగా పంచుకున్నారు.

సాయంకాలమయింది. కృష్ణుడు, గోపాలురు గోవులను వెంటపెట్టుకొని ఇళ్ళకు తిరిగి వస్తున్నారు. దారిలో అఘుడు అనే రాక్షసుడు కొండచిలువ రూపాన్ని ధరించి, అతి పెద్దదైన తన నోరు తెరచి అడ్డంగా పడుకున్నాడు. వానిని కంసుడే పంపించాడు. వాడు నోరు తెరిచాడంటే అందులోకి కార్లుకూడా వెళ్ళిపోతాయి. అంత పెద్ద నోరు తెరచి గోవులన్నింటినీ మ్రింగేశాడు. తరువాత గోపాలురనుకూడా మ్రింగబోతుంటే వాళ్ళు తమను రక్షించవలసిందిగా కృష్ణుణ్ణి

sri sathyasai vahini.org

ప్రార్థించారు. కృష్ణుడు వాళ్ళకు అభయమిచ్చి, అఘుని నోట్లో ప్రవేశించి తన శరీరాన్ని పెద్దదిగా పెంచేసరికి అఘుడు చీలిపోయి మరణించాడు. గోపాలురు కృష్ణుని మాహాత్మ్యాన్ని ఎంతగానో పొగిడి, ఈ విషయాన్ని గోకులంలో అందరికీ చెప్పారు. ఈవిధంగా గోపాలురు క్షణక్షణమూ కృష్ణుని దివ్యలీలలను అనుభవిస్తూవచ్చారు.

కృష్ణుని మహత్తరమైన లీలలు ఆ గ్రామమంతా ప్రాకిపోయాయి. దానితో కంసునికి కృష్ణునిపట్ల ద్వేషం మరింత పెరిగిపోయింది. ఇంక కృష్ణుణ్ణి రాక్షసులద్వారా హతమార్చటం సాధ్యంకాదని గుర్తించాడు. తన ఆస్థానంలో ఉన్న యోధులమధ్య మల్లయుద్ధ పోటీ ఏర్పాటు చేసి, దానిని చూడటానికి బలరామకృష్ణులను తీసుకురమ్మని అక్రూరుణ్ణి ఆదేశించాడు. అక్రూరునికి బలరామకృష్ణులను తీసుకురావటం ఇష్టంలేదు. కంసుడు ఆ పిల్లలకేమైనా హాని తలపెడతాడేమోనని అతను భయపడ్డాడు. కాని, రాజాజ్ఞను ఉల్లంఘించటానికి వీలుకాదు. అందుచేత రథమును తీసికొని వ్రేపల్లెకు వచ్చాడు. బలరామకృష్ణులు అక్రూరుని రథంలో కూర్చొని బయల్దేరబోతుంటే గోపికలు, గోపాలురు రథాన్ని ముందుకు వెళ్ళనివ్వలేదు. "కృష్ణా! కంసుడు మీకు హానిచేయటానికి ఇప్పటికే ఎన్నో వేషాలు వేశాడు. కాబట్టి మీరు వాని వద్దకు వెళ్ళకూడదు" అంటూ రథము ముందు అడ్డంగా పడుకున్నారు. అప్పుడు కృష్ణుడు ఆ సమయానికి తగినట్లు తీయని మాటలతో వారిని సమాధానపరచాడు.

బలరామకృష్ణులు మధురాపురం చేరుకున్నారు. కుబ్జ అనే పొట్టిగా, వంకరగా ఉండే ఒక స్త్రీ అనేక సుగంధద్రవ్యాలను తీసికొని కంసునివద్దకు వెళుతున్నది. ప్రతి నిత్యమూ ఆమె చేసే పని అదియే. కృష్ణుడు ఆమెవద్దకు వెళ్ళి "ఏమిటమ్మా పొట్టెమ్మా! ఇవన్నీ ఎవరికోసం తీసుకువెళుతున్నావు?" అని అడిగాడు. అందుకు కుబ్జ "బాలకా! చక్రవర్తియైన కంసునికి నా సుగంధ ద్రవ్యాలంటే చాలా ఇష్టం. అతనికోసమే నేను వీటిని తీసుకువెళుతున్నాను" అంది. ఆ మాటలు విని బలరామకృష్ణులు నవ్వారు. కృష్ణుడు మెల్లగా ఆమె దగ్గరకు వెళ్ళి, ఆమె రెండు పాదాలను తన పాదంతో త్రొక్కిపట్టుకొని, చెక్కు క్రింద చేయిపెట్టి పైకి లాగాడు. పొట్టిగా, వంకరగా ఉన్న ఆ కుబ్జ అందమైన రూపాన్ని పొందింది. ఆ ఆనందాన్ని తట్టుకోలేక కంసునివద్దకు పరుగెత్తింది. భగవంతుని లీలలు వర్ణనాతీతములు. దీనిని పురస్కరించుకొనియే

త్యాగరాజు చెప్పాడు -

"వాచామగోచరుండని
నీ చరితములను పొగడ బ్రహ్మాదులకైన తరమా!
హే కృష్ణా! కాచుకొన్నాను నీదు కృపకై
నా మొరాలకించి బ్రోవుమయ్య!
కాలుడు గొనిపోయిన గురుపుత్రుని తెచ్చి ఇచ్చినావు
కాళీయుని మదమణచినావు
వసుదేవ దేవకీ చెఱను విడిపించినావు
కుచేలుని ఆర్తి తీర్చినావు
కురూపియైన కుబ్జ వక్రములను పోగొట్టినావు
ఆ ద్రౌపది 'హా కృష్ణా!' యని మొరలిడ బ్రోచినావు
మేలుమేలు పాండవులను గాచినావు
పదహారువేల రమామణులను బ్రోచినావు
నీ చరితములను పొగడ బ్రహ్మాదులకైన తరమా?
హే కృష్ణా! కాచుకొన్నాను నీదు కృపకై
నా మొరాలకించి బ్రోవుమయ్య!"

బలరామకృష్ణులు వీథిలో నడుస్తూ వస్తుంటే ఇళ్ళలోపలినుండి స్త్రీలు బయటికి వచ్చి నమస్కారం చేస్తున్నారు. "ఈ పిల్లలెవరో గొప్ప చక్రవర్తి కుమారులుగా కనిపిస్తున్నారు, మహాతేజోవంతులుగా ప్రకాశిస్తున్నారు" అని తమలో తాము గుసగుసలాడుతున్నారు. బలరామకృష్ణులు రాజభవనంలో ప్రవేశించారు. అక్కడ మల్లయుద్ధం జరుగుతున్నది. ఆ యుద్ధంలో ఎవ్వరూ గెలవలేదు, ఎవ్వరూ ఓడిపోలేదు. ఇంతలో బలరామకృష్ణులు ఉన్నట్లుండి వేదికపైకి లంఘించి, అక్కడ కూర్చుని ఆ పోటీని తిలకిస్తున్న కంసుని మెడపట్టి క్రిందికి లాగారు. పైనుంచి క్రింద పడ్డాడు కంసుడు. కృష్ణుడు అతని పొట్టపైన కాలుపెట్టి చీల్చివేశాడు. కంసుడు మరణించాడు. అస్తి, ప్రాప్తి అనే పేర్లు గల కంసుని ఇద్దరు భార్యలు ఇంక అక్కడ

sri sathyasaivachanamrutam

ఉండటానికి వీల్లేక వారి తండ్రి ఇంటికి వెళ్ళిపోయారు. వారి తండ్రి ఈ వార్త విని కోపోద్రిక్తుడై బలరామకృష్ణులపైకి యుద్ధానికి బయల్దేరాడు. అనేక పర్యాయాలు వారితో పోరాడి వారిని జయించలేక అవమాన భారంతో వెనుదిరిగాడు. దుర్మార్గులను హతమార్చి, సన్మార్గులను పోషించి, సత్ప్రవర్తనను ప్రకటించే నిమిత్తం కృష్ణుడు అవతరించాడు. అది ద్వాపరయుగానికి సంబంధించిన ధర్మం. కాని, ఈ యుగానికి అది వర్తించదు. నేడు మంచి మాటలచేత, ఆదర్శవంతమైన ప్రవర్తనచేత మానవులను సరిదిద్దాలి.

ఒకనాడు పండ్లను అమ్మే ఒక స్త్రీ యశోద ఇంటి ముందుకు వచ్చింది ఆ రోజుల్లో పండ్లను ధనమిచ్చి కొనేవారుకాదు, కొంత ధాన్యమిచ్చి తీసుకునేవారు. ఆమె బలరామకృష్ణులను చూసి ఆనందంతో మైమరచి పోయింది. ఆ పిల్లలను తన దగ్గరికి పిలిచి, తన బుట్టలో ఉన్న మంచి ఫలములను ఏరి వారి నోటిలో పెట్టింది. కృష్ణుడు "అమ్మా! నీవు మాకు ఫలముల నిచ్చినందుకు ప్రతిఫలంగా నీకు మేమేదైనా ఇవ్వాలి కదా" అని అన్నాడు. వెంటనే ఇంట్లోకి వెళ్ళి తన బుచ్చిచేతుల నిండుగా బియ్యం తీసుకువచ్చాడు. దారిపొడవునా కృష్ణుని దోసిలినుండి బియ్యపు గింజలు కారిపోతూనే ఉన్నాయి. మిగిలిన కొద్దిపాటి బియ్యపుగింజలను కృష్ణుడు ఆమె బుట్టలో వేశాడు. ఆమె తన ఇంటికి వెళ్ళి బుట్టను దింపి చూసేసరికి అందులో అత్యంత విలువైన మణులు మెరుస్తూ కనిపించాయి. కృష్ణుడు బుట్టలో పోసిన బియ్యపు గింజలన్నీ విలువైన మణులుగా మారిపోయినాయి.

"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" కృష్ణలీలలు మనస్సునకు, వాక్కునకు అతీతమైనవి. అట్టి లీలలను తనివితీర అనుభవించి గోపాలురు తమ జీవితాలను సార్థకం గావించుకున్నారు. వారు చాలా పవిత్రమైన జీవితం గడుపుతూవచ్చారు. పరోపకారం తప్ప పరులకు అపకారం చేయటం వారెరుగరు. కనుకనే వారు భగవంతుణ్ణి గుర్తించగల్గారు. ఈనాడుకూడా అంతే. భగవంతుణ్ణి గుర్తించాలంటే మీరు పరోపకారం చేయాలి.

**నా చేయి ఎప్పుడూ ఉపకారం చేస్తూనే ఉన్నది**

సాయిబాబాకు వారిపైన కోపం, వీరిపైన కోపం అని కొన్ని వార్తలు వస్తున్నాయి. సాయిబాబాకు ఎవ్వరిపైనా కోపం లేదు. ఎవ్వరికీ స్వామిపై కోపం లేదు. అందరూ స్వామిని

srisathyasaivachanamrutam

ప్రేమించేవారే గాని, ద్వేషించేవారే లేరు. నేను చేస్తున్న ప్రతి పని ప్రపంచంలో అందరికీ తెలుసు. బయటి విద్యాసంస్థల్లో ఒక చిన్న పిల్లవాడు ఫస్ట్ క్లాసులో చేరాలంటే ఇరవై, ముప్పై వేలు డొనేషన్ కట్టాలి. కాని మన విద్యాసంస్థల్లో కె.జి. మొదలు పి.జి. వరకు ఏమాత్రం ఫీజు లేదు. పిల్లలనుండి మేము ఒక్క నయాపైసా తీసుకోవటం లేదు. ఈరీతిగా, కొన్ని వేలమంది పిల్లలను పోషించాము. ఇది ప్రపంచంలో అందరికీ తెలుసు.

బయటి హాస్పిటల్స్‌లో ఒక గుండె ఆపరేషన్‌కు రెండు, మూడు లక్షలు తీసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో బీదల గతి ఏమిటి? వారింత ధనం ఎక్కడినుండి తేగలరు? కనుకనే నేను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కట్టించి, ఇటువంటి ఖరీదైన ఆపరేషన్లను ఉచితంగా చేయిస్తున్నాను. ప్రభుత్వం నుండి మేము డబ్బు తీసుకోవటం లేదు. ఇక్కడింతమంది టీచర్లున్నారు. వీరి జీతాలనుకూడా నేనే ఇస్తున్నాను. మీకు తెలుసు - టీచర్ల జీతాలు దినదినానికీ పెరిగిపోతున్నాయి. ఎంత పెరిగినా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జీతాలిస్తున్నాము. ప్రభుత్వ నిబంధనలను ఎవ్వరూ ధిక్కరించరాదు. ప్రశాంతినిలయంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కట్టించి 10 సంవత్సరాలు గడిచిపోయాయి. ఇంత వరకు పన్నెండువేల గుండె ఆపరేషన్లు జరిగాయి. ఇంతమంది ప్రాణాలను ఎవరు రక్షించారు? ఈ సంవత్సరం జనవరిలో బెంగుళూరులో మరో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించాము. అక్కడ కేవలం ఆరు నెలల్లో 1500 ఆపరేషన్లు జరిగాయి. ఇదంతా ఎవరివల్ల జరుగుతోంది?

ఇంక, వాటర్ ప్రాజెక్ట్ (త్రాగునీటి పథకం) విషయానికి వస్తే - మన అనంతపురం జిల్లాలో ఇప్పటికీ కొన్నిచోట్ల త్రాగటానికి నీరు లేక ప్రజలు బాధపడుతున్నారు. అయితే 300 కోట్లు ఖర్చుపెట్టి సాధ్యమైనంతవరకు నీరు ఇప్పించాను. తెలంగాణా ప్రాంతమైన మహబూబ్‌నగర్‌లో ప్రజలు నీటి ఎద్దడితో చాలా బాధపడుతున్నారు. ఛీఫ్ ఇంజనీర్ కొండలరావుతో ప్లాను వేయవలసిందిగా చెప్పాను. "స్వామి! 60 కోట్లు కావచ్చును" అన్నాడు "ఎన్ని కోట్లైనా ఫరవాలేదు, వారికి తరగని నీరందించాలి" అని చెప్పాను. బోరింగులు వేయటంవలన ప్రయోజనం లేదు. కాబట్టి కృష్ణానదినుండి నీరు తెప్పించి ఇచ్చాము. 110 కోట్లుఖర్చైంది. మెదక్‌లోకూడా నీరందించటానికి ప్రయత్నిస్తున్నాము. ఇంకా ఎన్నో ప్రజోపయోగ

srisathyasaivachanamrutam

కార్యక్రమాలు జరుగు తున్నాయి. సాధ్యమైనంత వరకు మనం అందరికీ ఉపకారం చేయాలి. నా చేయి ఎప్పుడూ ఉపకారం చేస్తూనే ఉన్నది.

కాని ఇది ఓర్వలేనివారు, అసూయాపరులు అనేక రకములైన కథలల్లి దుష్ప్రచారం చేస్తుంటారు. అలాంటి ప్రచారాన్ని నేను లెక్కచేయను, నా ఆచారమే నాకు ప్రధానం. నాకు ఎవ్వరిపైనా ద్వేషంగాని, అయిష్టంగాని లేదు. ఈ విశ్వమంతా ఒకే కుటుంబమని భావించినప్పుడు ఇంక ద్వేషానికి అవకాశమెక్కడిది? నేను అందరినీ ప్రేమిస్తున్నాను. ఎవరేమి కల్పించినా నా సత్యానికి మార్పు లేదు. నావద్ద ఉన్న సంపద ఏమిటో మీకు ముందే చెప్పాను. ప్రేమయే నా సంపద. త్యాగమే నా భోగము. నాకు దీనిని మించిన ఆనందం మరొకటి లేదు. కనుకనే నేనింత కాలం ఇన్ని పనులు జరుపుతూవచ్చాను. నా సంగతి ఎవ్వరికీ తెలియదు. నా పనులకు అపజయమనేది లేదు, ఎల్లప్పుడూ విజయమే. మనం చేసేది మంచికార్యమైనప్పుడు మనం దేనికీ విచారించనక్కర్లేదు. మంచికార్యం తప్పక విజయవంతమౌతుంది.

**త్యాగానికి పూనుకుంటే డబ్బు దానంతటదే వస్తుంది**

బెంగుళూరులో కట్టించిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు నెలకు 3 కోట్లు ఖర్చవుతుంది. అక్కడ అవసరమైన మందులు, వాల్వులను అమెరికానుండి తెప్పిస్తున్నాము. మన ప్రశాంతినిలయంలో ఉన్న హాస్పిటల్‌కు నెలకు 2 కోట్లు ఖర్చవుతుంది. మేము గవర్నమెంటునుండి నయాపైసా ఆశించటం లేదు. వారుకూడా ఇవ్వటం లేదు. ప్రశాంతినిలయంలో, అనంతపురంలో, బెంగుళూరులో, రాజమండ్రిలో, ముద్దెనహళ్ళిలో మన విద్యాసంస్థలు ఉన్నాయి. వీటన్నింటికీ నెలకు ఒక కోటిరూపాయలు ఖర్చవుతుంది. ఇవన్నీ కలిపి నెలకు మొత్తం 6 కోట్లు ఖర్చవుతుంది. ఇంత డబ్బు ఎక్కడినుండి వస్తుంది? కాని ఇస్తున్నాము. ప్రభుత్వాన్ని అడుగకుండా వీటి బాధ్యతను సాధ్యమైనంతవరకు మనమే వహించాలి.

బెంగుళూరు హాస్పిటల్‌కొరకు 300 కోట్లు, ప్రశాంతి నిలయం హాస్పిటల్‌కొరకు 200 కోట్లు, మన విద్యాసంస్థలకొరకు 100 కోట్లు – మొత్తం 600 కోట్ల రూపాయలను బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే, ప్రతి నెల దానిపై వచ్చే వడ్డీతో మన విద్యా, వైద్యసంస్థలను ఇబ్బంది లేకుండా సుఖంగా జరిపించవచ్చునని నేను అనుకున్నాను. ఇక్కడింతమంది ఉన్నారుకాని,

srisathyasaivachanamrutam

నేను ఎవ్వరినీ ఏమీ అడగటంలేదు. నా చేయి ఎప్పుడూ ఇచ్చేదేకాని, పుచ్చుకొనేది కాదు. ఒక్క ప్రేమకు మాత్రమే నేను చేయిజాపుతాను. నాకు ఏనాడూ ఎట్టి ఆశలూ లేవు. కాని దీనిని ఎవ్వరూ అర్థం చేసుకోవటం లేదు. నేననుకున్న 600 కోట్ల రూపాయలు సోమవారం అమెరికానుండి వస్తున్నాయని ఈనాడొక వార్త వచ్చింది. నాకు కావాలని నేను ఎవ్వరినీ అడగలేదు. అడిగినంతమాత్రాన ఎవరైనా వందలకోట్లు విరాళంగా ఇస్తారా? ఎవ్వరూ ఇవ్వరు. కాని ఒకే వ్యక్తి ఈ 600 కోట్లు ఇస్తున్నాడు. "స్వామీ! ఈ డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయండి. వచ్చిన తక్షణమే బ్యాంకులో కట్టేయండి. సోమవారం 12 గంటలకు మీకు చేరుతుంది" అని తెలిపాడు.

ఈనాడు త్యాగభావంతో పని చేసేవారు లేరుగాని, త్యాగానికి పూనుకుంటే ఎన్ని కోట్లైనా వస్తాయి. భారతదేశం పవిత్రమైన దేశం. ఇది త్యాగభూమి, యోగభూమియేగాని, భోగభూమి కాదు. "నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్త్వమానశుః" మనలో త్యాగభావం ఉన్నందు వల్లనే మనకు కావలసినవన్నీ సమకూరుతున్నాయి.

## స్త్రీల గౌరవమర్యాదలను నిలబెట్టాలి

నేనింకా ఎన్నెన్నో చేయాలనుకుంటున్నాను. ఈ రోజుల్లో న్యూస్‌పేపర్లలో, సినిమాలలో భారతీయ సంస్కృతికి విరుద్ధమైన వేషాలు కనిపిస్తున్నాయి. భారతీయ స్త్రీధర్మం ఎంత పవిత్రమైనది! పవిత్రమైన మన భారతదేశంలో ఎంతోమంది సద్గుణవంతులైన స్త్రీలు జన్మించారు. మరణించిన పతిని బ్రతికించుకొన్నట్టి సావిత్రి, భర్త ప్రాణాలను కాపాడుకోవటానికి సూర్యోదయమే కాకుండా చేసిన సుమతివంటి పవిత్రమైన శక్తి గల్గిన స్త్రీలెందరో మన దేశంలో ఉన్నారు. కాని ఈనాడు స్త్రీలను చాలా చులకనభావంతో చూస్తున్నారు. చాలా తప్పు, తప్పు, తప్పు. దేశసౌభాగ్యం స్త్రీలపైననే ఆధారపడియున్నది. కనుక, స్త్రీల గౌరవమర్యాదలను కాపాడండి. ఇదే గొప్ప విద్య. ఏదో గొప్ప డిగ్రీలను పొంది విదేశాలకు పోయి డబ్బు సంపాదించటం గొప్పతనం కాదు. మన భారతీయ సంస్కృతిని నిలబెట్టాలి. ప్రాచీన కాలమునుండి భారతదేశంలో స్త్రీలకు ఎంతో గౌరవం ఇవ్వబడింది. కాని నేడు పత్రికలలోనూ, సినిమాలలోనూ స్త్రీలను చాలా అసభ్యంగా చూపిస్తున్నారు; భారతీయ సంస్కృతిని పూర్తిగా

విస్మరిస్తున్నారు.

స్త్రీల గౌరవంపైననే దేశగౌరవం ఆధారపడియున్నది. స్త్రీల సౌభాగ్యమే దేశసౌభాగ్యం. కనుక మనం స్త్రీధర్మాన్ని కాపాడాలి, స్త్రీల గౌరవమర్యాదలను నిలబెట్టాలి. దానికి తగినరీతిగా ప్రచారం చేసేవారికి కొన్ని లక్షలివ్వాలని సంకల్పించుకున్నాను. ఈ జగత్తులో ప్రతి ఒక్కటీ ధనంపైననే ఆధారపడి యున్నది. కాబట్టి ధనంతోనే ఈ ధర్మాన్ని మనం కాపాడాలి. పేపర్లలో, సినిమాల్లో అసభ్యకరమైన వేషాలు కనిపంచకూడదు. ఈనాటి పిల్లలు అలాంటి వేషాలను చూసి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. కనుక పవిత్రమైన భారతీయ సంస్కృతిని పోషించటానికి మనమెంతైనా పాటుపడాలి. దానికి నేను సిద్ధంగా ఉన్నాను. సత్యం చెప్పాలి. ధర్మమునాచరించాలి. అన్యాయ, అక్రమాలను అరికట్టాలి.

## ఉపరాష్ట్రపతి కృష్ణకాంత్ ఆదర్శం

వేదము 'మాతృదేవో భవ, పితృదేవో భవ" అని బోధించింది. తల్లిదండ్రులు పిల్లలకోసం తమ ప్రాణాలనే అర్పితం చేస్తారు. కనుక ముఖ్యంగా మనం తల్లిదండ్రులను సంతోషపెట్టాలి. ఒక చిన్న ఉదాహరణ: మన కృష్ణకాంత్ (ఉపరాష్ట్రపతి) ఇక్కడే ఉన్నాడు. ఇతని తల్లి చాలా గొప్ప భక్తురాలు. ఆమె నిరంతరం భగవచ్చింతన చేస్తుంది. ఈనాడు కృష్ణకాంత్ ఇంతటి పవిత్రమైన స్థితికి వచ్చినాడంటే, దీనికి అతని తల్లియే మూలకారణం. ఆమెను చూస్తే నాకెంతో ఆనందం కల్గుతుంది. ఆమె ఎప్పుడూ తన కుమారునికి భారతీయ సంస్కృతిగురించి చెబుతుంటుంది. "నాయనా కృష్ణా! నీవు శాంతంగా ఉండాలి. ఈ పని చేయాలి, ఆ పని చేయకూడదు" అని చిన్నపిల్లలకు బోధించినట్లుగా బోధిస్తుంది. నేటికి కూడా కృష్ణకాంత్ తల్లిమాటను జవదాటడు. ఎంతో విశ్వాసంతో, వినయవిధేయతలతో తల్లి చెప్పినట్లుగా నడుచుకుంటాడు. అలాంటి ఆదర్శవంతులైన పిల్లలు ఈనాడు తయారుకావాలి. తల్లులు మంచి వారైనప్పుడే పిల్లలు మంచివారుగా ఉంటారు. తల్లి ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలను సరియైనరీతిలో పోషించటానికి వీలౌతుంది. కనుకనే త్వరలో వైట్‌ఫీల్డ్‌లో Mother and Child Health Centre (మాతాశిశు ఆరోగ్య కేంద్రము)ను ప్రారంభిస్తున్నాము.

srisathyasaivachanamrutam

దురదృష్టవశాత్తు తండ్రిని కోల్పోయిన పిల్లలు ఈనాడు అనేక అవస్థలకు గురి అవుతున్నారు. అలాంటి పిల్లలను ఇక్కడికి తెప్పించి, వారికి ఇళ్ళు నిర్మించి, చదువుసంధ్యలు నేర్పించి వారిని ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దాలని నా సంకల్పం. ఈ విషయాన్ని మన కలెక్టరుకుకూడా చెప్పాను. తప్పక తాము సహాయం చేస్తామని అవసరమైన భూమికూడా ఇచ్చారు. ఇప్పుడక్కడ శంకుస్థాపన చేసి ఇళ్ళు కట్టించాలి. నా ఉద్దేశ్యం ఒక్కటే - సాధ్యమైనంతవరకు అందరికీ సహాయం చేయాలి. దాచుకొనే, దోచుకొనే స్వభావం కాదు నాది. నేను చేసే ప్రతి పని గొప్ప ఆదర్శవంతమైనది. కనుక మీకు తల్లిదండ్రులు లేని పిల్లలు చిక్కితే తీసుకురండి. వారికి చదువు చెప్పిస్తాము. తండ్రి లేకపోతే తల్లిపేరుతో ఒక లక్ష రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తాము. దానిపై వచ్చే వడ్డీతో తల్లి తన పిల్లవానిని పోషించుకోవచ్చును. ఇంతకు ముందు కొన్ని పద్యాలు చదివి వినిపించిన వ్యక్తి నాగార్జున గ్రూపు ఛైర్మన్. ఆయనకు చెప్పాను "మీరు త్వరత్వరగా ఇళ్ళు కట్టించి ఇవ్వాలి" అని. "స్వామీ! మీరెప్పుడు ఆజ్ఞాపిస్తే అప్పుడు మొదలుపెట్టటానికి నేను సిద్ధంగా ఉన్నాను" అన్నాడు. ఒక్కొక్కరికి ఒక్కొక్క ఇల్లు కట్టించాలి. పిల్లలను చక్కని విద్యావంతులుగా, వివేకవంతులుగా తీర్చిదిద్దాలి. ఈనాడు విద్యావంతులు అనేకమంది ఉన్నారుగాని, వారిలో అనేకులు అవివేకులుగా ఉన్నారు. విద్యతోపాటు వివేకంకూడా ఉండాలి. పిల్లల్లో అట్టి వివేకమును పెంచటానికి నేను కంకణం కట్టుకున్నాను. ఎవరేమనుకున్నా నేను లెక్కచేయను. నేను చేసేది మంచిపని. నేను అందరినీ ప్రేమిస్తున్నాను. అదేరీతిగా, మీరుకూడా అందరినీ ప్రేమించండి. సత్కార్యాలకు పూనుకోండి. సదాచారవంతులు కండి. ఎవరేవిధంగా ప్రచారం చేసినా మీరు లెక్క చేయకండి. మీరు పట్టిన దీక్షను సాధించండి.

**పట్టినదేదియో పట్టనే పట్టితివి**
**పట్టు నెగ్గెడుదాక అట్టెయుండు**
**కోరినదేదియో కోరనే కోరితివి**
**కొర్కె చెల్లెడుదాక కొలిచియుండు**
**అడిగినదేదియో అడుగనే అడిగితివి**
**అడిగినదిడుదాక విడువకుండు**
**తలచినదేదియో తలచనే తలచితివి**

sri sathyasaivachanamrutam

**తలపు తీరెడుదాక తరలకుండు**
**పోరు పడలేక నేనైన బ్రోవవలయు**
**ఒడలు తెలియక నీవైన అడుగవలయు**
**అంతియేకాని మధ్యలో ఆపివేసి**
**తిరిగిపోవుట భక్తుని దీక్ష కాదు**

ఒడలు తెలియక మీరైనా అడగాలి. పోరు పడలేక నేనైనా బ్రోవాలి. మన ఇద్దరి సంబంధం ఈ రకంగా ఉండాలి. అలనాడు బలరామకృష్ణుల జతలో ఉన్న గోపాలురు ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారు. మన కాలేజి విద్యార్థులుకూడా అలాంటి ఆదర్శాన్ని దేశానికి అందించాలి. తల్లిదండ్రులను గౌరవించాలి, ప్రేమించాలి, సేవించాలి. వారి ఆజ్ఞను శిరసావహించాలి. ఇదే భారతీయ సంస్కృతి యొక్క ప్రధానమైన ప్రబోధ. "లోకాస్సమస్తాః సుఖినో భవంతు" – ఇదే మన లక్ష్యం. "నేను మాత్రమే సుఖంగా ఉండాలి" అని అనుకోవటం స్వార్థం. స్వార్థమును త్యజించి పరార్థమును, పరమార్థమును దృష్టియందుంచుకోవాలి. మనలను దూషించినవారినికూడా మనం ప్రేమించాలి. దీనికి నేనే ప్రత్యక్ష నిదర్శనం. నా జీవితమే నా సందేశం. నన్ను మీరు అనుసరించండి. మంచికి ఎన్నో అడ్డంకులు వస్తుంటాయి. కాసిన చెట్టుకే రాళ్ళ దెబ్బలు. అట్లే మంచి చేసేవారికే అవరోధాలు కల్గుతుంటాయి. వాటికి మనమేమాత్రం భయపడకూడదు. వజ్రమును కోత కోసినకొద్దీ దాని విలువ పెరుగుతుంది. అట్లే దూషణవల్లనే భూషణ పైకి వస్తుంది. దూషణను లెక్కచేయక మన మంచిని మనం గట్టిగా పట్టుకోవాలి.

విద్యార్థులారా! విద్య గుణార్జనకోసమేగాని, కేవలం ధనార్జనకోసం కాదనే సత్యాన్ని మీరు గుర్తించండి. కలిమిని, బలిమిని, చెలిమిని పెంచుకుంటే సరిపోదు. వీటితోపాటు గుణమును కూడా పెంచుకోవాలి. భారతదేశ విశిష్టతను మీరు ప్రపంచమంతా చాటాలి. అన్ని దేశములవారు త్వరలోనే భారతదేశంతో ఐక్యతను పొందుతారు. ఈనాడు కృష్ణాష్టమి, భగవంతుడు పుట్టిన దినము. ఈనాడు నేను మీకొక 'ప్రామిస్' చేస్తున్నాను. అన్ని దేశములూ... పాకిస్తాన్, చైనా, జర్మనీ, రష్యా... అంతా కలసి ఒక్కరీతిగా పలుకుతాయి. మన భారతీయుల మంచితనమే

srisathyasaivachanamrutam

దీనికి మూలకారణం. ఈనాడు 'యూనిటీ' (ఐకమత్యం) కావాలి. 'యూనిటీ'లోనే 'ప్యూరిటీ' (పవిత్రత) ఉంటుంది. 'ప్యూరిటీ' ఉన్నచోటే 'డివినిటీ' (దివ్యత్వం) ఉంటుంది. కాబట్టి 'యూనిటీ, ప్యూరిటీ, డివినిటీ' ఈ మూడింటినీ మీరు అభివృద్ధిపరచుకోండి.

**(11-08-2001 ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vachanamrutam